# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 13-08-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ విలువలతో కూడిన నాణ్యమైన విద్యను అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.
- ❖ శాస్త్ర సాంకేతిక రంగంలో శాస్త్రవేత్తలు దేశానికి అందిస్తున్న సేవలు ఎనలేనివని శాస్త్ర, సాంకేతిక శాఖా మంత్రి కె. పవన్ కళ్యాణ్ అన్నారు.
- ❖ రేషన్ బియ్యం అక్రమ తరలింపుపై ప్రభుత్వం తీసుకున్న చర్యలు సత్ఫలితాలను ఇస్తున్నాయని పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడించారు.
- ❖ కృష్ణా, గోదావరి నదుల సంగమ ప్రాంతాన్ని ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు.

======================

విలువలతో కూడిన నాణ్యమైన విద్యను అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. ఈరోజు అమరావతిలో విద్యాశాఖపై నిర్వహించిన సమీక్షలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా పాఠశాల విద్యలో మార్పులు తీసుకు రావలన్నారు. ప్రైవేటు స్కూళ్లతో పోటీ పడేలా ప్రభుత్వ స్కూళ్లను తీర్చిదిద్దాలని సూచించారు. విద్యాశాఖలో సమూల మార్పులు తీసుకురావడం ద్వారా ఉత్తమ ఫలితాల సాధన లక్ష్యంగా పని చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. విద్య ప్రతి ఒక్కరి హక్కని, బడి ఈడు పిల్లలపై ప్రత్యేక దృష్టి సారించాలని చంద్రబాబు నాయుడు తెలియజేశారు.

======================

శాస్త్ర సాంకేతిక రంగంలో భారతదేశ శాస్త్రవేత్తలు దేశానికి అందిస్తున్న సేవలు ఎనలేనివని రాష్ట్ర శాస్త్ర, సాంకేతిక శాఖా మంత్రి కె. పవన్ కళ్యాణ్ అన్నారు. శ్రీహరికోటలోని భారత అంతరిక్ష పరిశోధనా కేంద్రం షార్ లో జరుగుతున్న జాతీయ అంతరిక్ష దినోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంతరిక్ష పరిశోధనల్లో శాస్త్ర వేత్తల పరిజ్ఞానాన్ని మంత్రి కొనియాడారు.

======================

రేషన్  బియ్యం అక్రమ తరలింపుపై ప్రభుత్వం తీసుకున్న చర్యలు సత్ఫలితాలను ఇస్తున్నాయని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. కాకినాడలో ఈరోజు మంత్రి పాత్రికేయులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ, బియ్యం అక్రమ రవాణాను అరికట్టేందుకు పోర్టులో చెక్ పోస్టులను ఏర్పాటు చేశామని, ఇప్పటికే  6 కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ నిబంధనల మేరకు బియ్యం రవాణా చేసుకునే వారికి ఎలాంటి ఇబ్బందులు కలగవని, తనిఖీల విషయంలో మాత్రం వెనకడుగు వేయబోమని మంత్రి స్పష్టం చేస్తూ....

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

రాష్ట్రంలో పర్యాటకానికి అధిక ప్రదాన్యతనిస్తున్నామని, దానికి అనుగుణగా చర్యలు చేపడుతున్నామని దేవాదాయ శాఖామంత్రి ఆనం రామనారాయణ రెడ్డి అన్నారు. ఈరోజు విజయవాడలో ఫెర్రీ ఘాట్ వద్ద  పవిత్ర సంగమం ప్రాంతాన్ని మంత్రులు పొంగూరు నారాయణ, కొలుసు పార్థసారథితో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి రామనారాయణ రెడ్డి మాట్లాడుతూ... కృష్ణా, గోదావరి నదుల పవిత్ర సంగమ ప్రాంతాన్ని ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని తెలియజేస్తూ.....

(వాయిస్ 32 సెకన్లు)

మంత్రి పొంగూరు నారాయణ మాట్లాడుతూ, ఈ ప్రాంతాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దటంతో పాటు భక్తులకు, పర్యాటకులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామని పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఉమ్మడి విశాఖ జిల్లాలో స్థానిక సంస్థల కోటాలో ఒక శాసనమండలి స్థానం ఉపఎన్నికకు కూటమి దూరంగా ఉండనుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ఈరోజు పార్టీ నేతలతో నిర్వహించిన దృశ్యమాధ్య సమావేశంలో ఈ మేరకు ముఖ్యమంత్రి నిర్ణయం తీసుకున్నారు. చంద్రబాబు నాయుడు నిర్ణయానికి కూటమి నేతలు ఆమోదం తెలియజేశారు. ఈనెల 16న నామినేషన్ల పరిశీలన, 30వ తేదీన ఉదయం 8 నుంచి 4 గంటల పోలింగ్ జరగనుంది.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

మన దేశ సంస్కృతి సాంప్రదాయాలను గౌరవిస్తూ ప్రపంచ దేశాలకు  భారత దేశ గొప్పతనాన్ని చాటి చెప్పేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని రాష్ట్ర న్యాయ మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి  ఎన్.ఎం.డి. ఫరూక్ అన్నారు. హర్ ఘర్ తిరంగ కార్యక్రమంలో భాగంగా ర్యాలీని, జిల్లా కలెక్టర్ జి.రాజకుమారితో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపుమేరకు "హర్ ఘర్ తిరంగా" కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నరు. దేశభక్తిని పెంపొందించడమే హర్ ఘర్ తిరంగా యోజన లక్ష్యం అని భారతీయ జనతాపార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధరేశ్వరి అన్నారు. విజయవాడలో నిర్వహించిన "హర్ ఘర్ తిరంగా" యాత్రను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దేశ మంతా జాతీయ జెండాను ప్రతి ఇంటి పైన ఆవిష్కరించు కోవాలన్నారు. దేశానికి స్వాతంత్ర్యం తీసుకురావటంలో ఎంతో మంది చేసిన కృషి, త్యాగాలు, సాహసాలను స్ఫూర్తిగా తీసుకొని యువత ముందుకు సాగాలని విశాఖ జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.  హరేంధిర ప్రసాద్ పిలుపునిచ్చారు. "హర్ ఘర్ తిరంగా" జెండా  ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా విశాఖ బీచ్ రోడ్డులో ర్యాలీని కలెక్టర్ ప్రారంభించారు. బాపట్లలో శాసనసభ్యులు నరేంద్ర వర్మ ఆధ్వర్యంలో "హర్ ఘర్ తిరంగా" ర్యాలీని  ఘనంగా

నిర్వహించారు. ప్రతి ఒక్కరిలో దేశభక్తి పెంపొందించడమే ఈ ర్యాలీ ఉద్దేశమని, రానున్న రెండు రోజులలో ప్రతి ఒక్కరి ఇంటి పైన తిరంగా జెండా ఎగరవేయాలని ఆయన కోరారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

మాదకద్రవ్యాల వినియోగాన్ని రూపుమాపేందుకు ప్రజలందరూ భాగస్వాములు కావాలని ఏలూరు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి పిలుపునిచ్చారు. "నాషా ముక్త్ భారత్ అభియాన్" కార్యక్రమంలో భాగంగా మాదకద్రవ్యాల నియంత్రణ, దుష్ప్రభావాలపై ఈరోజు ఏలూరు జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో అవగాహన ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో మాదకద్రవ్యాలు, అక్రమ మద్యం అమ్మకాలు, రవాణాపై ప్రత్యేక నిఘా పెట్టామని, వీటిని సరఫరా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో డి-అడిక్షన్ సెంటర్ ను నిర్వహిస్తున్నామని, మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలపై జిల్లాలోని అన్ని కళాశాలలు, పాఠశాలల్లో కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని కలెక్టర్ తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

అవయవదానంపై ఉన్న అపోహలను విడనాడాలని విశాఖ జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ పిలుపునిచ్చారు. ప్రపంచ అవయవదాన దినోత్సవం సందర్భంగా ఈరోజు విశాఖలోని వుడా చిల్డ్రన్ ఎరీనాలో రాష్ట్ర జీవన్ దాన్ ఫౌండేషన్ నిర్వహించిన అవగాహనా కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా సుమారు 5 లక్షల మంది అవయవాల కోసం నిరీక్షిస్తున్నారని, అవయవదానం చేయగలిగి ఉనప్పటికీ అపోహలతో ముందుకు రావడం లేదని తెలిపారు. చట్టబద్ధమైన అవయవదానంతో జరిగే మేలును అందరూ గుర్తించాలన్నారు. అవయవదానంపై వైద్య సిబ్బంది, ఎన్.జీ.ఓలు ప్రజలకు అవగాహనా కల్పించి ముందుకు వచ్చేలా ప్రజలను చైతన్య పరచాలని కోరారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

రాయలసీమ నుండి కొమోరిన్ ప్రాంతం వరకు ద్రోణి విస్తరించి సముద్ర మట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తులో కొనసాగుతుందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో రాగల 24 గంటలలో రాష్టంలో పలు చోట్ల తేలికపాటి నుండి మోస్తరు వర్షం లేదా ఉరుములతో కూడిన జల్లులు కొన్ని చోట్ల కురిసే అవకాశముందని తెలిపింది. ఒకటి లేదా రెండు చోట్ల భారీ వర్షాలు పడే అవకాశం ఉందని వెల్లడించింది. గంటకు 30 నుండి 40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశముందని పేర్కొంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = =